

మంత్రి వర్గ సమావేశంలో మంత్రి మండిపల్లి


# వైఎస్ఆర్-అన్నమయ్య వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

శుక్రవారం 20 డిసెంబర్ 2024


## ప్రభుత్వ జూనియర్ కళాశాలగా ప్లస్‌టు ఉన్నత పాఠశాల

చిట్వేలి డిసెంబర్ 19 ప్రభాతవార్త



ప్లస్‌టుగా కొనసాగుతున్న స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పూర్తిస్థాయిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మార్పు లభించినట్లు విద్యా శాఖ అధికారి కోదండ నాయుడు తెలియపరిచారు. ఈ మేరకు గురువారం జిల్లా విద్యా శాఖ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. ఈ ఏడాది విద్యా సంవత్సరంకు ఈ మార్పు వర్తిస్తుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్లస్ టు గా పదోన్నతి పొందిన 207 ఉన్నత పాఠశాలలకు ఈ మార్పు వర్తిస్తుందన్నారు. దీనితో పూర్తిస్థాయి సిబ్బంది,అన్ని గ్రూపులతో కూడినకో ఎడ్యుకేషన్ ఇంటర్మీడియట్ విద్య చిట్వేలి మండలంలో చేకూరానున్నదని ఎంఈఓ తెలియపరిచారు. కాగా బోధన సిబ్బంది లేక ఇబ్బంది పడుతున్న ప్లస్ టు ఉన్నత పాఠశాలలకు జూనియర్ కళాశాల మార్పుతో మేలు చేకూరుతున్న తరుణంలో కూటమి ప్రభుత్వం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఇప్పటికైనా ఎంపిలలో చలనం..!

- రెండేళ్లుగా పట్టించుకోని కడప - రేణిగుంట (ఎన్ హెచ్ -716) హైవే నిర్మాణం
- ఎట్టకేలకు నిర్మాణం పనులు చేపట్టమని కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, వి.సోమన్నలకి వైసిపి ఎంపిల వినతి

(అన్నమయ్య ప్రతినిధి - ప్రభాతవార్త)



కేంద్ర పరిధిలోని అనేక సమస్యలను ఉమ్మడి కడప జిల్లాలోని ఎంపిలు దశాబ్దాలుగా పట్టించుకోని కారణంగా అలాంటి సమస్యలు కొకొల్లలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పడి ఉన్నాయి. రైల్వే సమస్యలైతే పట్టించుకున్న పాపాన పోలేదంటే అతిశయోక్తి కాదు. సర్కార్ జిల్లాలతో పోలిస్తే ఉమ్మడి కడప జిల్లాలోని వచ్చే రేణిగుంట-గుంతకల్ రైల్వేమార్గం అత్యంత దీనస్థితిలో సమస్యల సుడి గుండంలో ఉందని చెప్పక తప్పదు. అలాగే రాజంపేటకు మంజూరైన మెడికల్ కళాశాల కూడా తరలిపోయింది. ఈ కోవలో కడప-రేణిగుంట ( ఎన్ హెచ్ 716 )4 లైన్ల గ్రీన్ ఫీల్డ్ హైవే కూడా టెండర్లు పూర్తయ్యి 26 నెలలు అవుతున్నా అతీగతీ లేదు. ఒక దశలో ఈ రహదారి నిర్మాణం కూడా జరగదన్న ప్రచారం కూడా జరిగింది. ఈ నేపథ్యంలో 26 నెలలుగా లేని చలనం ఇప్పటికైనా వైసిపి ఎంపిలకు వచ్చి గురువారం కేంద్ర రహదారుల మంత్రి నితిన్ గడ్కరీ, కేంద్ర రైల్వే, జలశక్తి శాఖ సహాయమంత్రి వి.సోమన్నలని కలిసి వినతిపత్రం సమర్పించడం శుభపరిణామం. ఈ విషయంలో రాష్ట్రంలోని కూటమికి చెందిన ముఖ్యనేతలు, పార్లమెంటు సభ్యులు కనీసం స్పందించకపోవడం అత్యంత దురదృష్టకరం. ఇప్పటికైనా కూటమి ఉమ్మడి కడప జిల్లా నేతలు స్పందించి సీఎం దృష్టికి తీసుకెళ్ళి కేంద్రంపై ఎన్‌హెచ్ -716 గ్రీన్ ఫీల్డ్ 4 లైన్ల నిర్మాణం పనుల చేపట్టేలా కృషి చేయాల్సిన అవసరం ఉంది. కేంద్రమంత్రులను కలిసిన వారిలో ఉమ్మడి కడపజిల్లాకు చెందిన పి.మిధున్‌రెడ్డి, మేడా రఘునాథరెడ్డి, మద్దిల గురుమూర్తి, వైఎస్ అవినాష్‌రెడ్డిలున్నారు. రైల్వే సమస్యలు, మంజూరైన మెడికల్ కళాశాల రాజంపేట నుండి తరలిపోవడం తదితర చరిత్రను పరిశీలన చేసుకుంటే వినతిపత్రంలో సరిపెట్టకుండా ఈ రహదారి నిర్మాణం టెండర్లు రెండు రీచ్‌లుగా పూర్తయ్యినందున త్వరితగతిన పనులు చేపట్టేలా కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ఉమ్మడి కడప జిల్లాలోని ఎంపిలపై అధికంగా ఉంది. చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే లాభం ఉండదు. ఎందుకంటే ఎన్‌హెచ్ 716 గ్రీన్ ఫీల్డ్ 4 లైన్ల రహదారి కడప జిల్లా నుండి రెండవ భద్రాది ఒంటిమిట్ట శ్రీ కోదండరామాలయం, అన్నమయ్య జన్మస్థలం తాళ్లపాక, రాజంపేట మీదుగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మంగంపేట బరైటీస్ మీదుగా రేణిగుంట వరకు సుమారుగా 120 కిలోమీటర్ల నిడివి ఉంటుంది. ఈ 4 లైన్ల గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే పూర్తయ్యితే అటు తిరుపతి మీదుగా బెంగుళూరుకు, చెన్నై నగరాలకు వెళ్ళేందుకు హైవే నిర్మాణం ఏర్పడుతుంది. ఏది ఏమైనా 26 నెలలుగా నిర్మాణానికి నోచుకోని ఈ హైవే నిర్మాణం పూర్తి చేయాలని ఉమ్మడి కడప జిల్లా ప్రజల చిరకాల కోరిక. ప్రస్తుతం కడప - రేణి గుంట రహదారి గుంతలమయమై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా ఉంది.

**- ఎన్‌హెచ్ - 716 పూర్వాశ్రమంలోకి వెళితే..**

రాజంపేట జిల్లా కేంద్రం సాధన కోసం రెండేళ్లకు ముందు ఉద్యమం జరుగుతున్న వేళ పలు అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్టు వైసిపి నేతలు నాడు ప్రకటన విడుదల చేయడం అప్పట్లో రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. రాజంపేట పార్లమెంటు సభ్యులు పి.మిధున్‌రెడ్డి సహకారంతో ఈ ఎన్ హెచ్ - 716 రహదారి నిర్మాణానికి నిధులు మంజూరైనట్టు ఇందుకు సంబంధించి కేంద్ర మంత్రులతో ఉన్న మిధున్‌రెడ్డి ఫోటోలను స్థానిక వైసిపి నేతలు విడుదల చేశారు. కడప-రేణిగుంట హైవేలో రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని ఒంటిమిట్ట , నందలూరు, రాజంపేట, పుల్లంపేట, రైల్వేకోడూరు, శెట్టిగుంట, రేణిగుంట మీదుగా నేషనల్ గ్రీన్ హైవేకు 2 రీచ్‌లతో రూ.3714.69 కోట్లు నిధులు మంజూరవుతున్నట్టు ప్రకటించినా టెండర్లు సుమారుగా రూ.2250 కోట్లకే జరిగినట్టు సమాచారం. అలాగే గాలేరు-నగరి జలాశయం సెకండ్ ఫేస్ క్రింద రూ.2000 కోట్లు నిధులు మంజూరైనట్టు, అన్నమయ్య జలాశయం కాంక్రీట్ సైడ్ వాల్స్‌కు రూ.400 కోట్లు నిధులు మంజూరయ్యాయని కూడా వైసిపి నేతలు ప్రకటన విడుదల చేయడం జరిగింది. అయితే వాటికి సంబంధించి అతీగతీ లేదు. రాజంపేట, రైల్వే కోడూరు మీదుగా వెళుతున్న గ్రీన్ ఫీల్డ్ హైవేకు సంబంధించి సర్వే కూడా పూర్తయ్యినా భూ సేకరణకు సంబంధించి పూర్తిస్థాయిలో పనులు పూర్తి కావాల్సి ఉంది. ఇక గాలేరు-నగరి జలాశయం సెకండ్ ఫేస్‌కు సంబంధించి రెండు దశాబ్దాలు పైబడి ఇక్కడి అన్నదాతలను పాలకులు ఊరిస్తూనే వస్తున్నారు. నిజంగా ఇటీవల కొట్టుకుపోయిన అన్నమయ్య జలాశయం సైడ్ వాల్స్ కాంక్రీట్ నిర్మాణంకు, అలాగే గాలేరు-నగరి జలాశయం సెకండ్ ఫేస్‌కు నిధులు మంజూరై పనులు జరిగితే రాజంపేటకు మంచిదే. అయితే నిజంగా నిధులు మంజూరై పనులు మొదలైతే కాని గత అనుభవాల దృష్ట్యా నమ్మలేని పరిస్థితిలో స్థానిక ప్రజలు, రైతులున్నారు. నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవేకు సంబందించ ప్యాకేజీ -1లో రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, పుల్లంపేట వరకు మొత్తం దూరం 64.2 కిలోమీటర్ల పరిధిలో వెహికల్స్ అండర్ పాస్ క్రింద 5, లైట్ వెహికల్స్ అండర్ పాస్ క్రింద 35, అనిమల్ అండర్ పాస్ క్రింద 4, బ్రిడ్జిస్ 29 నిర్మాణం జరిగేలా రూపొందించినట్టు సమాచారం. అలాగే ప్యాకేజీ -2లో పుల్లంపేట, రైల్వేకోడూరు, శెట్టిగుంట, రేణిగుంటల వరకు మొత్తం దూరం 57.73 కిలోమీటర్ల పరిధిలో రీ అలైన్‌మెంట్ 2.391 కిలోమీటర్లు 5 చోట్ల, వెహికల్స్ అండర్

## ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి

# చిత్తశుద్ధితో పని చేయండి

సబ్ కలెక్టర్ నైదియాదేవీ





రాజంపేట అర్బన్, డిసెంబర్ 19 ప్రభాతవార్త

డివిజన్ పరిధిలో ఎస్సీ ఎస్టీల సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని సబ్ కలెక్టర్ నైదియాదేవీ కోరారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయలో డివిజన్ స్థాయి ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం జరిగింది. సమావేశంలో సబ్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ప్రతినిధుల సమన్వయంతో ఎస్సీ ఎస్టీల సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో నిర్లక్ష్యం లేకుండా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు. అలాగే భూముల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా రాజంపేట, రైల్వే కోడూరుల పరిధిలో దళిత ,గిరిజనుల సమస్యలను సమస్యలకు సంబంధించి ఎమ్మెల్యేలు ఆకేపాటి అమర్నాథరెడ్డి, అరవ శ్రీధర్ ప్రస్తావించారు. సమావేశంలో రాజంపేట డిఎస్పి నాంపల్లి సుధాకర్ తో పాటు డివిజన్లోని తాసిల్దారులు ,వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బెంగుళూరు-విజయవాడ హైవే నిర్మాణం

# పనులను అడ్డుకున్న రైతులు

రైతులకు సర్ది చెప్పిన తహసీల్దార్



చాపాడు, డిసెంబర్ 19, ప్రభాతవార్త:

చాపాడు మండలంలోని అనంతపురం, బూడిదపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలో జరుగుతున్న బెంగుళూరు - విజయవాడ గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణ పనులను గురువారం భూ బాధిత రైతులు అడ్డుకున్నారు. ఈ రోడ్డుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్స్ గురించి ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయనే విశయంపై రైతులు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న మండల తహసీల్దార్ రమాకుమారి సంఘటనా స్థలానికి చేరుకొని బాధిత రైతులతో చర్చించారు. రైతుల పేరిట ఎంజాయ్‌మెంట్, ఆన్‌లైన్‌కు సర్వే నంబర్లలో తేడాలు, ఎంజాయ్‌మెంట్‌లో ఉండి ఆన్‌లైన్‌లో లేకపోవడం, మిగులు భూములు మొదలగు వాటికి సంబంధించిన ఏమేమి సమర్పించాలి అనే విశయంపై విశదీకరించారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఈ క్రాప్ బుకింగ్, బ్యాంకు లోను, రైతు భరోసా, ఆర్‌హెచ్, ఈసీ మొదలగునవి సమర్పించిన ఎడల ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందని ఆమె వివరించారు. ఈ చర్చలో హైవే ఆథారిటీస్ వారు కూడ పాల్గొన్నారు. హైవే రోడ్డు వేసేటప్పుడు రైతులు అడ్డు పడకుండా ఉండాలని ఆమె సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టర్‌తో మీ విషయం చర్చించి అందరికి న్యాయం చేస్తామని తెలిపారు. అందుకు రైతులు సమ్మతించి త్వరలో మా సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్ కృష్ణారెడ్డి, రీ సర్వే డీటీ నారాయణ స్వామి, సర్వేయర్ లక్ష్మీ నారాయణ, వీఆర్వో మంజుల, రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన జాబ్ మేళా

కాశినాయన, డిసెంబర్ 19 (ప్రభాత వార్త):



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కల్పన మరియు వ్యవస్థాపక అభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో గురువారం పోరుమామిళ్ల మండల వెలుగు సమాఖ్య నందు జాబ్ మేళాను నిర్వహించడం జరిగినది. ఈ జాబ్ మేళాకు సంబంధించి గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, అబి గ్రీన్ టెక్నాలజీస్ యంగ్ ఇండియాఅనే మూడు కంపెనీల వారు పాల్గొనగా 70 మంది నిరుద్యోగ యువతీ యువకులు హాజరయ్యారు. ముఖ్య అతిథులుగా మండల సమైక్య ఇంచార్జి ఏపీఎం పిచ్చయ్య, ప్లేస్మెంట్ ట్రైనర్ పృధ్విరాజ్, ఏపీ ఎస్ ఎస్ డీ సి కోఆర్డినేటర్ మోహన్,సీడాప్ కోఆర్డినేటర్లు ఆంజనేయులు నరసింహులు కవిత, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## విద్యుత్ పొదుపుపై ట్రాన్స్‌కో ఉద్యోగులు ర్యాలీ

మదనపల్లె, డిసెంబర్ 19 ప్రభాతవార్త :

జాతీయ ఇందన పొదుపు వారత్సవాల్లో భాగంగా ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ ఉద్యోగులు గురువారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ డివిజన్ కార్యాలయం నుండి ర్యాలీ ప్రారంభమై అంబేద్కర్ సర్కిల్, టౌన్‌బ్యాంకు కూడలి,చిత్తూరుబస్టాండు, బెంగుళూరు బస్టాండు, ఎన్‌టిఆర్ సర్కిల్‌మీదుగా ఎస్‌బిఐ కాలనీ ద్వారా డివిజన్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్బంగా డివిజనల్ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ ఎం.రఘునాథ్ మాట్లాడుతూ ఒక్క యూనిట్ ఆదా చేస్తే రెండు యూనిట్లు ఉత్పత్తితో సమానం అన్నారు. అదే విధంగా విద్యుత్ పొదుపు కోసం ఎల్‌ఈడి బల్బులు, స్టార్ రేటెడ్ విద్యుత్ ఉపకరణాలు వాడాలన్నారు. అదే విధంగా సోలార్ సర్వీసును పెంపొందించుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సబ్సిడీలు, 1కిలోవాల్డ్ రూ.30వేలు, 2కిలోవాట్స్ రూ.60వేలు, 3కిలోవాల్డ్ 78వేలు పొందవలెనని తెలిపారు. నేటి పొదుపు బావితరాలకు పొదుపు అన్నారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్ డిఈ హరికుమార్, సురేంద్రనాయక్, ఏఏఓ కిరణ్‌కుమార్, జేఏఓ రెడ్డప్ప, ఏఈలు కుమార్‌బాబు, అజయ్‌బాబు, రమేష్, రామ్మూర్తి, ముజిమల్ ఉద్యోగులు పాల్గొన్నారు.





## ఎమ్మెల్యే దృష్టికి పంట నష్ట రైతు సమస్యలు

తేదేపా సీనియర్ నేత సందుల నాగ శివారెడ్డి

ఖాజీపేట, డిసెంబర్ 19, ప్రభాతవార్త:



వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో తుఫాను ప్రభావం కారణంగా పంటలకు ఎనలేని నష్టం వాటిల్లిందని, నష్టాన్ని అంచనా వేసి రైతన్నలను ఆదుకోవాలని కడప మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్, టిడిపి మండల సీనియర్ నాయకులు సందుల నాగ శివారెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం కారణంగా వర్షాల వల్ల పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని ఈ విశయాన్ని రైతుల పక్షాన తాను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈ విశయం గురించి ఎమ్మెల్యే జిల్లా వ్యవసాయ ఉన్నతాధికారులతో మాట్లాడి రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, పంట నష్ట నివేదికలు తెప్పించుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పడం జరిగిందన్నారు. పంట నష్ట నివేదికలను అధికారుల ద్వారా తెప్పించుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని తాను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్‌ను కోరినట్లు చెప్పారు. పత్తి, మినుము, వరి తదితర పంటలకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లిందని రైతన్నలను ఆదుకునే చర్యలు ఎమ్మెల్యే, ప్రభుత్వం తప్పక తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం తరపున వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయం గురించి కూడా ఎమ్మెల్యేకు తెలిపినట్లు పేర్కొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

దువ్వూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త:

మండలంలో పరిష్కారం కాని భూ సమస్యలు పరిష్కరించేందుకే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని మండల తహసీల్దార్ ఇక్బాల్ బాష తెలిపారు. గురువారం దువ్వూరు గ్రామ సచివాలయంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రైతులకు సంబంధించిన విస్తీర్ణాలు తక్కువ, ఎక్కువ ఉన్నా వాటిని సరిచేసుకోవాలని తెలిపారు. అలాగే ఆన్‌లైన్ కాకుండా ఉండిన భూములు వాటికి సంబంధించిన రికార్డులు తీసుకొని వస్తే ఆన్‌లైన్ చేస్తామన్నారు. దువ్వూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 7ధరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి తహసీల్దార్‌లు కరీముల్లా, వేణుగోపాల్, డివిజనల్ సర్వేయర్ వెంకటేశ్వర్లు, మండల సర్వేయర్ పద్మావతిలు పాల్గొన్నారు..





## విద్యార్థులు

# నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ఆదిత్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి

మదనపల్లె, డిసెంబర్ 19 ప్రభాతవార్త :

విద్యార్థులు వివిధ ప్రోగ్రామ్‌లో పాల్గొనేటప్పుడు సృజనాత్మకతను పెంపొందించుకొని క్రమశిక్షణతో తమ ఆలోచన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి తెలిపారు. పట్టణ సమీపంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాలలో సిఎస్‌ఈ డిపార్ట్‌మెంటు ఆధ్వర్యంలో డ్యాసింగ్ త్రింగింగ్, క్రిటికల్ థింకింగ్, అండ్ ఇన్నోవేషన్ డ్యాసింగ్‌పై రెండు రోజులు వర్క్‌షాపు నిర్వహిస్తున్నారు. రెండు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా డాక్టర్ ఆర్.గోవిందరావు, ఎస్‌ఎస్‌కె ఆటోమోటీవ్స్ ప్రైవేటు లిమిటెడ్ జనరల్ మేనేజర్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతారన్నారు. సాఫ్ట్‌వేర్‌లను ఎలా తయారు చేయాలో అదే విధంగా తమ క్రియోటీవీటిని ఎలా పెంపొందించుకోవాలో కొత్త కొత్త టెక్నాలజీలను ఏ విధంగా కనిపెట్టాలో, పరిశ్రమల్లో ఉద్యోగాలు ఏ విధంగా పొందాలో వివరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌ఈ డిపార్ట్‌మెంటు హెచ్‌ఓడి డాక్టర్ కె.లక్ష్మియ్య, కోఆర్డినేటర్ డాక్టర్ వి.శివశంకర్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## బిజెపి ఎంపీలపై దాడి చేసిన

# రాహుల్ గాంధీ క్షమాపణలు చెప్పాలి

బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రమేష్

రాజంపేట అర్బన్, డిసెంబర్ 19 ప్రభాతవార్త



పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ప్రతిపక్ష పార్టీలు నినాదాలు చేస్తూ బిజెపి ఎంపీ లైన పీసీ సారంగి , ముఖేష్ రాజపుత్ పైన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ దాడి చేయడం చాలా హేయమైన చర్య అని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇంచార్జ్ పోతుగుంట రమేష్ నాయుడు అన్నారు.ప్రజాస్వామ్యంలో ప్రజాస్వామ్యంపై విశ్వాసం వుండేవారు పార్లమెంట్లో చర్చించాలి గాని ఇలా గుండా లాగా ప్రవర్తించడం సిగ్గుమాలిన చర్య అన్నారు.రాహుల్ గాంధీ వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంపై విశ్వాసం ఉంది కాబట్టే తిరిగి బిజెపి ప్రతిఘటించలేదని పేర్కొన్నారు. అంతకుముందు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పైన జరిగిన చర్చిలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు కూడా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి సరైన గౌరవం ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. .బాబా సాహెబ్ అంబేద్కర్ విషయంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ కపటబుద్ధినే చూపించిందన్నారు.. ఎన్నికలలో రెండుసార్లు ఓడించింది.ఆయనను పార్లమెంటులోకి రాకుండా చేసింది.కానీ బిజెపి ప్రభుత్వం ఆయన్ని భారతరత్న తో గౌరవించిందని గుర్తు చేశారు. ఆయన జీవితానికి సంబంధించిన 5 ప్రదేశాలను పంచతీర్థాలుగా అభివృద్ధి చేసిందన్నారు.. ఇప్పుడు ఏకీకృత కోడ్ బిల్లును తీసుకురావడానికి ప్రయత్నిస్తోందన్నారు. బాబా సాహెబ్ అంబేద్కర్కి నిజమైన గౌరవాన్ని ఇస్తుంది బిజెపి మాత్రమే అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎస్సీ మూర్చ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాపయ్య ,పట్టణ ప్రధాన కార్యదర్శి వివి రమణ ,బీజేపీ పట్టణ కార్యదర్శి పెనుగొండ రమణ బిజెపి సీనియర్ నాయకులు గాజుల శ్రీనివాసులు, బీజేవైఎం నాయకులు రాయల్ ,కిరణ్ సూర్య, తదితరులు పాల్గొన్నారు.

## రబీలో పంట నమోదును పూర్తి చేయాలి

దువ్వూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త:

మండల పరిధిలోని 15గ్రామ సచివాలయాల పరిధిలో రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన వివిధ రకాల పంటలను ఈ క్రాప్‌లో నమోదు చేయాలని ఏడీఏ అనిత అన్నారు. గురువారం నాడు మండల పరిధిలోని రామాపురం, గుడిపాడు గ్రామాల్లో వ్యవసాయ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది, వ్యవసాయ, ఉద్యానవన శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో గ్రామాల వారీగా ఏ పంటలను సాగు చేశారు, సాగు వివరాలు పంట నమోదులో ఏ మేరకు నమోదు చేస్తున్నారు, గ్రామాల వారీగా ఎంత విస్తీర్ణం అయింది ఏ మేరకు నమోదు చేశారో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సంధర్భంగా రెండు గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను పరిశీలించారు. రైతులకు పలు రకాల సూచనలు, సలహాలు అందజేశారు. తుఫాన్ ప్రభావం వల్ల వర్షాలు వచ్చే అవకాశం ఉందని వరి కోతలు వాయిదా వేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి అమర్ నాథ్ రెడ్డి, బేస్లి, సిబ్బంది పాల్గొన్నారు.



## ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోండి,

**మైదుకూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త:**

మైదుకూరు ఆర్టీసీ డిపో కార్గో డోర్ డెలివరీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మైదుకూరు డిపో మేనేజర్ కె.శ్రీరామ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 50 కేజీల వరకు డోర్ డెలివరీ సౌకర్యాన్ని ఆర్టీసీ కార్గో ద్వారా కల్పిస్తున్నామన్నారు.డోర్ డెలివరీ ప్రచార మహోత్సవం 20.12.24 నుండి 19.01.25 వరకు రాష్ట్రవ్యాప్తంగా 80 ముఖ్య పట్టణాలలో 50 కేజీల వరకు పది కిలోమీటర్ల విస్తీర్ణం వరకు డోర్ డెలివరీ సదుపాయం కలదని తెలిపారు.ఈ అవకాశాన్ని నియోజకవర్గ పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించేందుకు కార్గో సేవలను ప్రజలకు అందుబాటులో తెచ్చామని పేర్కొన్నారు.

## అమీత్‌షా వ్యాఖ్యలపై వీసీకే నిరసనలు

**మదనపల్లె, డిసెంబర్ 19 ప్రభాతవార్త :**



పార్లమెంటు సమావేశాల్లో అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమీత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వీసీకే పార్టీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం బెంగుళూరు రోడ్డులోని అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్‌షా చిత్రపటాన్ని మంటల్లో దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ప్లకార్డులు ప్రదర్శించి పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మీద గౌరవం లేని అమీత్‌షాకు రాజ్యాంగబద్ధమైన పదవుల్లో కొనసాగే అర్హత లేదన్నారు. కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీసికే, బాస్ ప్రతినిధులు ముత్యాల మోహన్, నీరుగట్టు రమణ, రవిశంకర్, రెడ్డప్ప, బురుజు రెడ్డిప్రసాద్, గంగాధర్, ఇర్ఫాన్‌ఖాన్, పి.రవి పాల్గొన్నారు.

## ఈనెల 28న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభ

**మదనపల్లె, డిసెంబర్ 19 ప్రభాతవార్త :**

పట్టణంలో ఈనెల 28, 29న ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సర్వేపల్లి నరసింహా తెలిపారు. గురువారం ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయాలంటూ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ మహాసభలకు ఎస్ఎఫ్ఐ లాంటి విద్యార్థి సంఘాన్ని విద్యార్థులే ఆర్థికంగా సంఘాన్ని బలోపేతం చేసుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాలల అధ్యాపకులు స్వచ్ఛందంగా మహాసభ జయప్రదానికి ముందుకు రావాలన్నారు.

## అరికెలలో రెవెన్యూ సదస్సులు

**రామసముద్రం, డిసెంబర్ 19 ప్రభాతవార్త :**



రామసముద్రం మండలంలోని అరికల గ్రామ పంచాయితీలో రెవెన్యూ సదస్సు నిర్వహించిన తహశీల్దార్ నిర్మలాదేవీ మాట్లాడుతూ రైతులు తమ భూములు పరిష్కారానికి గ్రామ రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసదస్సులో 24అర్జీలు వచ్చాయని 45రోజుల్లో పరిష్కారానికి చర్యలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నిర్మలాదేవి, మండల సర్వేయర్ నాగరాజు, ఆర్ఐ వషీం అక్రమ్, విఆర్ఓ రామచంద్ర, ఈఓ రమణారెడ్డి, ఫారెస్టు చిట్టిబాబు, సురేంద్రయాదవ్, స్కూల్ ఛైర్మెన్ భువనేశ్వర్‌రెడ్డి, మార్కెట్ రమణ, సర్పంచ్ నారాయణ, లక్ష్మిదేవి, బాలప్ప, బుడ్డారెడ్డి తదితురులు పాల్గొన్నారు.

## మిట్స్ కళాశాలలో వర్క్‌షాప్

**కురబలకోట, డిసెంబర్ 19 ప్రభాతవార్త :**




మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్(డేటా సైన్స్) విభాగం ఆధ్వర్యంలో డెవోప్స్ఎస్సెన్సియల్ విత్‌టూల్స్ అనే అంశంపై మూడు రోజుపాటు వర్క్‌షాపును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కె.అభిజిత్ సరళాయ, ఎల్అండ్‌టి హెడ్, ప్రైవేటు లిమిటెడ్ బెంగుళూరు, ఎం.విజయశాంతి, సీనియర్ అసోసియేట్ దేవోప్స్‌లు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేవోప్స్ ఎస్సెన్షియల్స్ విత్‌టూల్స్, ఏఐతో ఏకీకరణపై తన విస్తృతమైన పరిశ్రమ పరిజ్ఞానాన్ని పంచుకొన్నారు. నేటి వేగవంతమైన సాంకేతికతతో నడిచే ప్రపంచంలో కంపెనీలు సాఫ్ట్‌వేర్ సేవలను వేగంగా సమర్థవంతంగా తక్కువ లోపాతో అందించేందుకు నిరంతరం ఒత్తిడికి గురవుతున్నాయన్నారు. అనేక కంపెనీలు టెక్ దిగ్గజాల నుండి చిన్న స్టార్టప్‌ల వరకు పోటీతత్వాన్ని పొందేందుకు దేవ్‌ఆప్స్ డెవోప్స్‌ను స్వీకరించాయన్నారు. విద్యార్థులు వీటతిపై అవగాహన పెంచుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామనాథన్, విభాగాదిపతి డాక్టర్ కుసుమ, అసిస్టెంట్ ప్రొఫెసర్ టి.శ్వేతా, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్త్రీశక్తి భవనంలో రెండవరోజు శిక్షణ

**రామసముద్రం, డిసెంబర్ 19 ప్రభాతవార్త :**

మండలంలోని స్త్రీ శక్తి భవన్‌లో రెండవరోజు ఎంపిడిఓ భానుప్రసాద్ ఆధ్వర్యంలో గురువారం సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ భానుప్రసాద్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రణాళికబద్ధంగా సమన్వయంతో పనిచేయాలని అందుబాటులో ఉన్న వనరులను సముచితంగా వినియోగించుకోవాలని, మౌళిక సదుపాయాలను కల్పించుకొని పేదరిక నిర్మూళనా రహిత సమాజాన్ని నిర్మించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాల పిల్లలకు హెల్త్ స్క్రీనింగ్

**తొండూరు, డిసెంబరు 19, ప్రభాతవార్త :**



తొండూరు మండలంలోని మల్లేలలోని 1, 3వ అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు డాక్టర్ రేష్మా నిర్వచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు తల చుట్టుకొలత, చాతికొలత, జబ్బకొలతలు .బరువు, ఎత్తు లు చూసి పిల్లలు బరువుకు తగిన ఎత్తు, వయసుకు తగిన బరువు ఉన్నారా అనే విషయం పరిశీలించారు. అలాగే జబ్బుల గురించి పరీక్షించారు. ఆరోగ్య లోపాలు ఉన్నవారిని గుర్తించారు. పిల్లల పోషకాహారం గురించి ఆరా తీశారు. వ్యాధినిరోధక టీకాలు, గర్భవతులకు అందించు సేవలు గురించి రికార్డులు తనిఖీలు చేశారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన కార్యక్రమం పరిశీలించారు. ఇందులో హెల్త్ ఎడ్యు కేటర్ మల్లయ్య, హెల్త్ ప్రొవైడర్ సోమేశ్వరి, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ లైసెన్సులు తప్పనిసరిగా కలిగి ఉండాలి

**వేంపల్లి, డిసెంబరు 19, ప్రభాతవార్త :**



ప్రతి ఒక్కరూ లైసెన్సులు తప్పనిసరిగా కలిగి ఉండాలని ఎస్సై తిరుపాల్ నాయక్ పేర్కొన్నారు. గురువారం వేంపల్లి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి, హనుమాన్ జంక్షన్ సర్కిల్ వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు సక్రమంగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ప్రతి వాహనదారుడు వాహనంలో వెళ్లేటప్పుడు రికార్డులను తమ వద్ద వుంచుకోవాలని సూచించారు. నంబర్ ప్లేట్లు కూడా వాహనాలకు ఉండాలని, లేనిచో వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని తెలిపారు. ట్రాఫిక్ నియమ నిబంధనలను పాటించి రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు ప్రతి వాహనదారుడు సహకరించాలని కోరారు. రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలిపి ప్రజలకు ఆటంకం కలిగించ వద్దని కోరారు. ఎస్సై తోపాటు కానిస్టేబుల్ బాబా ఫక్రుద్దీన్ హోంగార్డ్ అశోక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## జలజీవన్ మిషన్ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు

**వేంపల్లి, డిసెంబరు 19, ప్రభాతవార్త :**

జలజీవన్ మిషన్ పనుల పునరుద్ధరణ కోసం రూ.70 వేల కోట్లతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెల్లడించారని జనసేన పార్టీ పులివెందుల నియోజకవర్గ సీనియర్ నేత డా. దాసరి రవిశంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర గ్రామీణ ప్రజలకు రోజు తలసరి 55 లీటర్ల చొప్పున రక్షిత మంచినీటిని సరఫరా చేసేలా ప్రణాళికలు చేస్తున్నారని, రాష్ట్రంలోని ప్రతి మారుమూల గ్రామంలో రక్షిత మంచినీరు అందించడం ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని దీనికి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ప్రధాని నరేంద్ర మోడీ , జలవనరుల శాఖ మంత్రి కేంద్ర ప్రభుత్వ పెద్దలు సహకరించాలని డా. దాసరి రవిశంకర్ తెలిపారు.

# చెరువులను, కాలవలను పరిశీలించిన ఇరిగేషన్ ఎఈఈ

**సుండుపల్లి, డిసెంబర్19, ప్రభాత వార్త :**



మండలంలోని మాచి రెడ్డి గారి అన్ పల్లి గ్రామంలోని రెడ్ల చెరువును అందుకు సంబంధించిన కాల్వలను ఇరిగేషన్ ఏఈఈ నాగేంద్ర నాయిక్ పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా ఈ చెరువు కుడిభాగంలోని కట్టను వెడల్పు పెంచాల్సిన అవసరం ఉందని, అలాగే కట్టకు ఎగువ ప్రాంతంలో ప్రొటెక్షన్ వాల్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదనీ అలాగే ఎడమవైపు ఉన్న తూముకు రిపేర్లు చేయాల్సిన అవసరం ఉన్నదనీ సంబంధిత నూతనంగా ఎంపికైన నీటి సంఘం ఛైర్మన్ కు తెలిపారు. అనంతరం పించా ప్రాజెక్టు కుడికాలువ నుండి రెడ్డి చెరువుకి నీరు వెళ్లే జంక్షన్ దగ్గర ఉన్న షట్టర్లను నిర్మించాలనీ అలాగే కాలువ వెంబడి అక్కడక్కడ స్ట్రక్చర్లు దెబ్బతిన్నవనీ మరియు ఈ కాలువ యొక్క లైనింగ్ దెబ్బతిన్నదనీ వీటన్నిటిని రిపేర్ చేయాల్సిన అవసరం ఉన్నదనీ చూసించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన, కృష్ణారెడ్డి చెరువు నీటి సంఘం అధ్యక్షులైన ఆనంద్ రెడ్డి తో కలిసి చెరువును పరిశీలించడం జరిగినది. ఈ సందర్భంగా చెరువు ప్రెసిడెంట్ , చెరువు కట్ట పైన ఉన్న ముళ్లపదులను తొలగించాలని, ఎడమవైపు అలుగు దిగు భాగంలో ఆప్రాన్ పూర్తిగా దెబ్బతినిందని దానిని రిపేరు చేయాలని, అదేవిధంగా ఆయకట్టుదారులు తమ పొలాలకు వెళ్లే గ్రావెల్ రోడ్డు రిపేరు మరియు రోడ్డు వెంబడి ఉన్న ముళ్లపొదలను, చెట్లను తొలగించాలని, అలాగే చెరువు దిగభాగంలో మడితాడు దగ్గర ఉన్న అయ్యవారి చెరువు కి నీరు వెళ్లే చోట సరైన మార్గం ఏర్పాటు చేయాలని వారికి చూచించారు. అనంతరం రాతి చెరువును పరిశీలించడం జరిగినది ఈ చెరువు కుడి భాగంలోని అలుగు దిగువ ప్రాంతం పూర్తిగా దెబ్బతిని ఉన్నదనీ అలాగే ఎడమవైపు ఉన్న అలుగు వంక చాలా వరకు పూడికతో కూడుకొని ఉన్నదనే అలాగే కుడి తూము నుంచి నీరు వెళ్లే మార్గంలో అక్విడక్ట్ అనే స్ట్రక్చర్ పూర్తిగా దెబ్బ తినడం వలన ఆయకట్టుకు నీరు వెళ్లడానికి అవకాశం లేకుండా పోయింది కావున దానిని కూడా కొత్తదిగా ఏర్పాటు చేయాలని, అలాగే దిగువన చెరువు కట్ట కోతకు గురయ్యే అవకాశం ఉంది కాబట్టి అక్కడ ప్రొటెక్షన్ గోడ కట్టాల్సిన అవసరం ఉందని నీటి సంఘం అధ్యక్షుడికి తెలియ జేశారు. అలుగు పారే కుడి వంక అలాగే ఎడమ వంక రెండింటికి కూడా డిసిల్టింగ్ చేయాల్సిన అవసరం ఉందని గమనించడం జరిగినది. అనంతరం తర్వాత రెడ్ల చెరువును పరిశీలించడం జరిగినది ఈ చెరువు కట్టమీద ఉన్న కంప చెట్లను తొలగించాలని అలాగే ఎడమవైపు వెళ్లే వంక మార్గాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉందనీ తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని అన్ని చెరువులకు సంబంధించిన బౌండరీల వెంబడి ట్రెంచ్ ను కొట్టడం వలన ఎటువంటి దురాక్రమంలో జరగడానికి అవకాశం లేదని ఆయన తెలిపారు. ఈ కార్యమంలో ఆయనతో పాటు సంబంధిత నూతనంగా ఎంపికైన నీటి సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షులు రైతులు పాల్గొన్నారు

## పైపు మరమ్మతు పనుల పరిశీలన

**పులివెందుల రూరల్ , డిసెంబరు 19, ప్రభాతవార్త :**



పులివెందుల పట్టణానికి నీటిని సరఫరా చేసే నక్కలపల్లి సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద జరుగుతున్న పైప్ లైన్ లీకేజి పనులను మున్సిపల్ కమిషనర్ డి రాముడు గురువారం మున్సిపల్ డి. ఈ .చిదానంద రెడ్డితో కలిసి పరిశీలించారు. వీలైనంత త్వరగా పైప్ లైన్ లీకేజి పనులను పూర్తి చేసి పట్టణ ప్రజలకు నీటిని సరఫరా చేయాలని సిబ్బందికి ఆదేశించారు.

## సంక్షేమ వసతి గృహాల వసతుల కోసం 13,19 కోట్లు

**లక్కిరెడ్డిపల్లె,డిసెంబరు 19, ప్రభాతవార్త**



అన్నమయ్య జిల్లాలోని సాంఘీక సంక్షేవాఖ వసతి గృహాల మరమతులకు రాష్ట్ర ప్రభుత్వం 13,19 కోట్ల రూపాయ 2 లను మంజూరు చేసిందని తొందరలో పనులు ప్రారంభిస్తామని జిల్లా సాంఘీక సంక్షేమశాఖ అధికారి జయప్రకాశ్, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు గంపల వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం లక్కిరెడ్డిపల్లెలోని ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను ఆయన అకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా మూడు వసతి గృహాల్లోని సమస్యలను ఆయన గుర్తించారు అనంతరం విద్యార్థులతో మాట్లాడారు మెను ప్రకారం భోజనం, ప్రభుత్వం అందించిన, విద్యామెటీరియల్, యూనిఫాం, అందియా లేదా అని విద్యార్థులను అడిగి తెలుస కున్నారు. పదోవ తరగతి పబ్లిక్ మార్చిలో జరగనున్నవని విద్యార్థులను ఉదయం సాయంత్రం వేలల్లో స్టడీలు నిర్వహించి మంచి పలితాలు వచ్చేటట్లు చూడాలని హెచ్ డబ్లుఓలకు సూచించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎస్సీ1ఎస్సీ2 బాలుర వసతి గృహాలు శిథిలావ్యవస్థలో ఉన్నాయని తొంగతిన నూతన భవనాలను ఏర్పాటు చేస్తామ లక్కిరెడ్డిపల్లెలోని వసతి గృహాల మరమతులకు 68లక్షలు, బాలికల వసతిగృమానికి 9లక్షలు మంజూరు పనులు జరుగుతున్నాయన్నారు. అంతేకాకుండా ఈ మూడు వసతి గృహాలకు డైనింగ్ హాల్, ముగుదొడ్లు, నిర్మాణాలకు 52 లక్షల రూపాయలు మంజూరు చేశామన్నారు.జిల్లాలోని 43 వసతి గృహాలకు మోళిక వసతులు, ఇతర నిర్మాణం పనుల కోసం 19.16 కోట్ల రూపాయలు నివేదికలు పంపించామని ప్రస్తుతం 13,19 కోట్ల రూపాయలు మంజూరు అయ్యాయని తొందిరిలో పనులు ప్రారంభిస్తా మన్నారు. విద్యార్థుల మోళిక వసతుల కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాటు చేస్తోందని ఆయన తెలియజేశారు. జిల్లా వ్యాంప్తంగా 10వ తరగతిలో మంచి పలితాలు సాదించేందుకు ఉదయం సాయంత్రం వేలలల్లో ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ డబ్లుఓలు రమేష్ బాబు,శ్రీనివాసులల, సావిత్రి విద్యార్థులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పిల్లలకు దుప్పట్లు పంపిణీ

**లక్కిరెడ్డిపల్లి : డిసెంబర్ 19 ప్రభాతవార్త**



లయన్స్ క్లబ్ రాయచోటి వారి ఆధ్వర్యంలో గురువారం దివ్యాంగుల పాఠశాలలోని విద్యార్థులకు, శ్రీ హరి పాపులర్ షూ కంపెనీ నందు పిల్లలకు మంచి నాణ్యత గల దుప్పట్లు అందించినట్లు లైన్స్ క్లబ్ అధ్యక్షులు పి.శివారెడ్డి తెలియజేశారు. పిల్లలకు అందించిన దుప్పట్లకు దాత మిక్కిలినేని ప్రసాద్ నాయుడు మాట్లాడుతూ లక్కిరెడ్డిపల్లి దివ్యాంగుల పాఠశాల నందు పనిచేస్తున్న టీచర్ రామ్మోహన్ పిల్లలకు చలి ఎక్కువగా ఉందని తమ దృష్టికి తీసుకురావడంతో , తమ వంతు బాధ్యతగా పిల్లల అందరికి నాణ్యత గల దుప్పట్లు అందించామన్నారు. రాబోయే రోజుల్లో తమ వంతుగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిఎంటి కోఆర్డినేటర్ పిఎస్ హరినాథ్ రెడ్డి, జోన్ చేర్మెన్ మహమ్మద్, మాజీ డిస్ట్రిక్ట్ ఛైర్మన్ నారాయణరెడ్డి, మాజీ అధ్యక్షులు చాన్ బాషా, కోశాధికారి కిషోర్ కుమార్ రెడ్డి, పవన్ కుమార్ ,హరి పాపులర్ షూ కంపెనీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట చెరువుకు సాగునీరు అందించాలి

### రాష్ట్ర మంత్రిని కలిసినమండల టిడిపి నాయకులు

**ఒంటిమిట్ట డిసెంబర్19 ప్రభాతవార్త:**



ఒంటిమిట్ట చెరువుకు సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని మండ ల టిడిపి నాయకులు రాష్ట్ర మంత్రి రామానాయుడును కలిసి వినతి పత్రం ఆందజేశారు. గురువారం విజయవాడలోని మంత్రి కార్యలయంలో ఆయనను కలసి వినతి పత్రం ఆందజేశారు.5000 ఎకరాలకు సాగునీరు తాగునీరు ఆందించే ఒంటిమిట చెరువు పంపింగ్‌స్కీంకు శాశ్వత ప్రాతిపదికన మూడు కిలో మీటర్ల మేర ఇసుప కొట్టాలతో నిర్మా ణం చేయాలని ఆందుకు ఆవసరమయ్యే 10.5 కోట్ల రూపాయలను మంజురు చేసి మండల రైతాంగాన్ని ఆదుకోవాలని మండల నాయకులు తెలిపారు. 2014లో టిడిపి ఆదినేత 34 కోట్లతో స్కీం నిర్మాణం చేపట్టారని టిడిపి హయాంలో నాలుగు సంవత్సరాలు పాటు చెరువుకు నీరు నింపడం జరిగిందని కాగా వైకాపా ప్రభుత్వం హయాంలో ప్రభుత్వం నిర్వా కంవలన ఆదికారులఆలసత్వం వలన చెరువుకు గడిచిన ఐదు సంవత్సరాలుగా నీరు నింపకపోవ డంతో మండలంలో కృతిమంగా కరువు పరిస్థితు లూన్నయని తెఇపారు. మూల పద్ద పంపింగ్ శ్రీరామ ఎత్తపోతల పథకాన్ని పునరుద్దరించి మండల రైతాంగాన్ని ఆందుకోవాలనివారు తెలి పారు. ఫిబ్రవరి లోపల ఇనుపగోట్టాలతో నిర్మించేం దుకు నిదులు వెంటనే మంజురు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మజీ డైరెక్టర్ కోమరా వెంకటసరసయ్య, టిడిపి నాయకులు పామూరు సుబ్రమణ్యం, బాలమునెయ్య,మామిళ్ళ ఈశ్వరయ్య, మామిళ్ళ రామకృష్ణయ్య, తదితరులు పాల్గోన్నరు.

## విద్యార్థులకు విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమం

**లక్కిరెడ్డిపల్లి : డిసెంబర్ 19 ప్రభాతవార్త**



విద్యుత్ పొదుపు వారోత్సవాలు ఏ.ఈ. ఈ. యుగంధర్ ఆదేశాల మేరకు గురువారం మండల కేంద్రంలోని నలంద హైస్కూల్ నందు విద్యార్థులకు విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగమణి స్వామి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఇంటిలో వాడే విద్యుత్ పరికరాలను, వాటి విధివిధానాలను విద్యార్థులకు విపులంగా వివరించారు. అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ హరినాథ్ మాట్లాడుతూ పిల్లలు భావితరాలకు పెన్నిధి వంటి వారిని , విద్యుత్ ను పొదుపు చేసుకుండే పద్ధతులను ఇప్పటి నుంచే అలవాటు చేసుకోవాలన్నారు. నలంద హైస్కూల్ కరస్పాండెంట్ ఏ.ఎస్. బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ విద్యుత్ పొదుపు ఎంతో ఆవశ్యకమని విద్యార్థులందరూ దీని గురించి విధిగా తెలుసుకొని ప్రతి విద్యార్థి విద్యుత్ ను పొదుపు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నలంద స్కూల్ డైరెక్టర్ రమణ , విద్యుత్ సిబ్బంది బాబ్జాన్ , మల్లికార్జున , వేణుగోపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అమిత్‌షా క్షమాపణ చెప్పాలి

**లక్కిరెడ్డిపల్లి : డిసెంబర్ 19 ప్రభాతవార్త**




పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్ షా క్షమాపణ చెప్పాలని పి.డి.ఎస్.యు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని దప్పేపల్లి గ్రామం జాండపల్లిలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అని, అటువంటి మహోన్నత వ్యక్తిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసం అని ధ్వజమెత్తారు. దేశవ్యాప్తంగా ఇప్పటికే ఆందోళన కార్యక్రమాలు జరుగుతున్నాయని కావున ఇప్పటికైనా కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పందించి ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ ఆందోళన కార్యక్రమాలు మరింత ఉధృతం అవుతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పి.డి.ఎస్.యు. జిల్లా నాయకులు జగదీశ్వర్ రెడ్డి, ప్రవీణ్, షాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ను పొదుపుగా వాడుకోవాలి

**లక్కిరెడ్డిపల్లె, డిసెంబరు 19 ప్రభాతవార్త**

విద్యుత్ను పొదుపుగా వాడుకోవాలి డిప్యూటి ఇంజనీర్ నాగముణి స్వామి పేర్కొన్నారు. విద్యుత్ పొదుపు వారోత్సవాలల్లో భాగంగా గురువారం స్థానిక నలంద స్కూల్ నందు విద్యుత్ వినియోగం పొదుపు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్వాల విలువైనదని ఇంటిలో కర్మాగారలల్లో లేకపోతే ఏపని జరగదని ఇంటిలో చాల మంది బల్బులు, ప్యాన్లు, టీవీల వాషింగ్ మిషన్లు ప్రతి ఎలాక్ట్రానిక్ విద్యుత్నే నడవాలని అందుకు విద్యుత్ను పొదపుగా వాడుకోవాలన్నారు. కరెంట్తో పనిచేసే వాటర్ హీటర్లు గ్రీజర్లు విద్యుత్ ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

**ఒంటిమిట్టడిసెంబర్19ప్రభాతవార్త:**



మండలంలోని రైతుల సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు ఒక వేదికగా ఉపయెగపడుతాయని రాజంపేట టిడిపి ఇన్‌చార్జి సువాసి బాల సుబ్రమణ్యం తెలిపారు. గురవారం మండలంలోని పెన్నపేరూరులో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈకార్యాక్రమానికి ఆయన తోపాటు కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్ విచ్చేశారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమాలను నివారించేందుకే రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు, ఎక్కడా జరగని విధంగా రాష్ట్రంలో భూ ఆక్రమాలు జరిగాయనివ వాటిని నివారించేందుకు గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇది రైతుల సంక్షేమం కోరే ప్రభుత్వమని రూతుల మెడకు ఉరితాడు బిగించే ల్యార్డ్ టైటిల్ యక్టును ప్రభుత్వం ఏర్పడిన రెండు నెలలోనే రద్దు చేడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో మండలస్పెషల్ ఆఫీసర్ బ్రహ్మయ్య, మండల తహసిల్దార్ రవణమ్మ, మండల టిడిపి ఆద్యక్షుడు గజ్జల నరసింహారెడ్డి, మండల ప్రదాన కార్యదర్శి బొబ్బిలిరాయుడు , మండల ఆదికారులు, ప్రజాప్రతినిదులు, తదితరులు పాల్గోన్నరు.



## భూ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు



**వాల్మీకిపురం డిసెంబర్ 19 ప్రభాతవార్త :**

గ్రామీణ ప్రాంతాలలో రైతుల భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవిన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతోందని వాల్మీకిపురం తహసీల్దార్ పామిలేటి పేర్కొన్నారు. గురువారం మండలంలోని మంచూరు గ్రామంలో రెవిన్యూ సదస్సు నిర్వహించి రైతుల సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. గ్రామీణ రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలను నేరుగా తన దృష్టికి తెస్తే తప్పక పరిష్కరిస్తామన్నారు. ఎక్కడ కూడా భూ కబ్జాలు ఉండరాదనీ ఆలా పాల్పడ్డవారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ లక్ష్మి ప్రసన్న, సర్వేయర్ పూర్ణ చంద్ర, రెవిన్యూ ఇన్స్పెక్టర్ సుగుణ, వివిధ శాఖల అధికారులు,రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


### ఉద్యోగ ప్రకటన

ప్రొద్దుటూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లిమిటెడ్, ప్రొద్దుటూరు నందు ఖాళీగా వున్నటువంటి పోస్టులకు తాత్కాలిక ప్రాతిపదికన ఈ క్రింది ఉద్యోగములు భర్తీ చేయుటకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

1) క్లర్కు పోస్టు - 1 2) అటెండర్ పోస్టు - 1

క్లర్కు పోస్టుకు ఏదైనా డిగ్రీ కలిగి కంప్యూటర్ నాలెడ్జ్ కలిగి ఉండవలెను. B.com.కంప్యూటర్స్ గానీ, M.B.A. చేసిన వారికి మరియు ఏదైనా కో-ఆపరేటివ్ బ్యాంకు నందు 2 సంవత్సరములు అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. వయసు 30-11-2024వ తేదీ నాటికి 35 సం॥లు మించకూడదు.

అటెండర్ పోస్టుకు ఇంటర్‌మీడియట్ పాస్ అయి వయస్సు 30-11-2024వ తేదీ నాటికి 35 సం॥లు లోపు ఉండవలెను. పై అర్హతలు గల అభ్యర్థులు 26-12-2024వ తేదీ లోపున ప్రొద్దుటూరు కోఆపరేటివ్ టౌన్ బ్యాంకు C.E.O. గారికి దరఖాస్తు పంపవలెను. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులను స్టాఫ్ సెలక్షన్ కమిటీ ద్వారా ఇంటర్వ్యూ జరిపి ఎంపిక కాబడిన అభ్యర్థులకు నియామకము ఉత్తర్వులు ఇవ్వబడును. ఎంపిక కాబడిన అభ్యర్థులు 1 సం॥ ప్రొబేషన్ కాలము పూర్తి చేయవలెయును. ప్రొబేషన్ కాలములో క్లర్కుకు రూ. 6,875/- బేసిక్ వేతనము, అటెండరుకు రూ.5,320/- బేసిక్ వేతనము మరియు వీటిపై D.A. మరియు H.R.A. ఇవ్వబడును.

**ఎంపిక విధానము :-**

అభ్యర్థులను ఎంపిక చేయు విధానములో స్టాఫ్ సెలక్షన్ కమిటీదే తుది నిర్ణయము.

**దరఖాస్తు పంపవలసిన చిరునామ :-**

చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్,
ది ప్రొద్దుటూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్,
డోర్ నెం.10/650, కె.కె.స్ట్రీట్,
ప్రొద్దుటూరు-516 360.
వై.యస్.ఆర్.కడప జిల్లా.

ఇట్లు
B.V.సుబ్బారెడ్డి
అధ్యక్షులు
ప్రొద్దుటూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు లిమిటెడ్
ప్రొద్దుటూరు.

# మత సామరస్యానికి ప్రతీక క్రిస్మస్



మదనపల్లె, డిసెంబర్ 19 ప్రభాతవార్త :
మత సామరస్యానికి ప్రతీక క్రిస్మస్ పండగ అంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. గురువారం గ్లోరీ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బైపాస్‌రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాలులో నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. గ్లోరీ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జాన్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాస్టర్స్‌కు బట్టలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్యాగాలకు ప్రత్యేకంగా జరుపుకునే క్రిస్మస్ వేడుకలను ముందస్తుగా నిర్వహిస్తున్న జాన్‌బాబు బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవ పాస్టర్లకు తెలుగుదేశం ప్రభుత్వం పాలనలో అన్ని విధాల ఆదుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం శ్మశాన స్థలం కావాలని పాస్టర్లు తెలపగా సమాధులకు స్థలం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్లోరిన్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జాన్‌బాబు, సెక్రటరీ జాన్సన్, కమిటీ సభ్యులు సుధాకర్, జయకుమార్, ఎలీసా, సామేలు, సామ్‌సంగ్, జాన్సన్ అధికసంఖ్యలో పాస్టర్లు పాల్గొన్నారు.

## కళాశాలలో భద్రత కట్టుదిట్టం చెయ్యండి

వాల్మీకిపురం, డిసెంబర్ 19 ప్రభాతవార్త :



వాల్మీకిపురం ఏపీ మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో భద్రతా చర్యలు కట్టుదిట్టం చెయ్యాలని స్థానిక సీఐ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ రామామంజులతో మాట్లాడుతూ కళాశాల ఆవరణలో సీసీ కెమెరాలను పూర్తిస్థాయిలో ఉండేలా చూడాలన్నారు. బాలికల హై స్కూల్, కళాశాల ఒకే ప్రాంగణంలో ఉండటం ఇరు యాజమాన్యాలు భాద్యతగా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ముఖ ద్వారం వద్ద కూడా తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అలాగే అనుమానిత వ్యక్తులు కళాశాల పరిసరాలలో కనిపిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించడం ద్వారా తగు చర్యలు తీసుకుంటామన్నారు. గత ఆదివారం రాత్రి కళాశాలలో ఆకతాయిల ప్రవర్తన పట్ల ఆ ప్రాంతంలో రాత్రి గస్తీ కూడా పెట్టడం జరిగిందన్నారు. కళాశాలలో సమస్యల పరిష్కారం విషయమై స్థానిక ఎంపీడీఓ మనోహర రాజు, ట్రాన్స్కో ఏ.ఈ.రాజశేఖర్ లు పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## బుడుగుంటపల్లిలో రెవెన్యూ సదస్సు



రైల్వేకోడూరు డిసెంబర్ 19 ప్రభాత వార్త:
మండలంలోని కే బుడుగుంటపల్లిలో సర్పంచ్ దార్ల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తాసిల్దార్ మెహబూబ్ చాంద్ నేతృత్వంలో గ్రామ రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పలు భూ సమస్యలు వచ్చాయని వాటిని వేగవంతంగా పరిష్కరించేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవిన్యూ సదస్సును ఏర్పాటు చేసిందని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తాసిల్దార్ మెహబూబ్ చాంద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ లక్ష్మీదేవి, సర్వేర్ బాలసుబ్రమణ్యం, విఆర్వోలు తోపాటు ఉప సర్పంచ్ యజ్ఞం చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ బత్తిన గంగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన సుస్థిరాభివృద్ధి శిక్షణా కార్యక్రమం




పీలేరు డిసెంబర్ 19 ప్రభాతవార్త :
స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకై నిర్వహించిన శిక్షణ కార్యక్రమం ముగిసిందని ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్ కార్యాచరణ ప్రణాళిక 2024 25 అమలులో భాగంగా పీలేరు మండల పరిధిలోని గ్రామ సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు, గ్రామ పంచాయతీ సర్పంచులకు స్థానిక సి.ఎల్.ఆర్.సి భవనంలో నిర్వహించిన రెండు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రిన్సిపాల్, ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఆదేశాల మేరకు పీలేరు మండల పరిధిలోని గ్రామ స్థాయి అధికారులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, సర్పంచులకు స్థానికీకరణ, సుస్థిర అభివృద్ధి అంశాలపై ఈ శిక్షణను ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఈ.ఓ. ఆర్.డి లతీఫ్ ఖాన్, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్ర, ఐసిడిఎస్ సూపర్వైజర్ స్వరూప, వెలుగు ఏపిఎం జోహార్ బాష, ఐసిడిఎస్ సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## స్టాండింగ్ కమిటీలో 15 ఆమోదం రెండు తిరస్కరణ

కడప కార్పొరేషన్ డిసెంబర్ 19 ప్రభాతవార్త:



కడప నగరపాలక సంస్థలో గురువారం మేయర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో స్టాండింగ్ కమిటీ సమావేశం జరిగింది. 15 అంశాలకు గాను 13 అంశాలను కమిటీ ఆమోదం తెలిపింది. 41 డివిజన్ విద్యాసాగర్‌లో సిసి రోడ్డుకు ఆమోదం తెలిపారు. 7వ డివిజన్ శంకరాపురం ప్రాంతంలో సీసీ రోడ్డు పనులకు ఆమోదం తెలిపారు. ముత్తరాజు పల్లెలోని జెడ్పి హై స్కూల్ లో సిసి రోడ్డు ఆమోదం తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో ఏర్పాటుచేసిన గోశాలలో ఆవు లేదా దూడలను రైతులకు, దేవస్థానం వారికిగానీ ఇచ్చినందుకు షరతులతో తీర్మానించారు. 12 వ డివిజన్లో సిసి రోడ్డు పకీరు పల్లెకు వెళ్లే సిసి రోడ్డు ఆమోదం తెలిపారు. నగరపాలక సంస్థలో 437 మంది కంటింజెంట్ వర్కర్లు ను కొనసాగిస్తూ తీర్మానం చేశారు. సమావేశంలో స్టాండింగ్ కమిటీ సభ్యులు14 డివిజన్ కార్పొరేటర్ కె బాబు, 28 వ డివిజన్ కార్పొరేటర్ అరిఫుల్ల, 37 వ డివిజన్ కార్పొరేటర్ సమ్మెట వాణి, 38 వ డివిజన్ కార్పొరేటర్ మక్బూల్ బాషా, 40 వ డివిజన్ కార్పొరేటర్ బాలస్వామి రెడ్డి, కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి, ఎస్ ఈ చెన్నకేశవరెడ్డి, ఎంహెచ్ఓ డా. ఎం.చంద్రశేఖర్, సిపి రమణ, ఈ ఈ నారాయణస్వామి, ధనలక్ష్మి, ఆర్ ఓ లు కన్నయ్య, విజయ భాస్కర్ గౌడ్, మేనేజర్ గుర్రప్ప పాల్గొన్నారు.

# అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు



బద్వేలు అర్బన్, డిసెంబర్ 19(ప్రభాతవార్త):
రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బి ఆర్.అంబేద్కర్ పై భారత హోం మంత్రి అమిత్ షా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని దళిత, ప్రజా సంఘాల నాయకులు ఆక్షేపించారు. అంబేద్కర్ పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు భారత హోం మంత్రి అమిత్ షా పార్లమెంటు వేదికగా భారతరత్న బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. అమిత్ షా తాను చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని భేషరతుగా క్షమాపణలు చెప్పాలన్నారు. భారతదేశానికి రాజ్యాంగాన్ని అందించిన మహానుభావుడుని చులకన చేసి మాట్లాడం బాధాకర మన్నారు. దళిత బడుగు వర్గాల ఆరాధ్య దైవమైన అంబేద్కర్‌ను తూలనాడిన అమిత్ షా ను కేంద్రమంత్రి వర్గం నుంచి వెంటనే తొలగించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ దళిత నాయకులు ఓఎస్ ప్రసాద్,కూకట్లపల్లి మురళి,మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయ సాధన కమిటీ అధ్యక్షులు ముండ్లపాటి పిచ్చయ్య, సి.నారాయణ, మాలమహానాడు సీనియర్ నాయకులు వంకెల సుబ్బరాయుడు, వెంకటసుబ్బయ్య, ఆర్. లక్ష్మీనరసయ్య, డి. గంగయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎన్. ప్రసాద్, భాస్కర్, సుధాకర్, దళిత నాయకులు ఉల్లాజి మురళి, పిల్లి భాస్కర్, కె.తిరుపాల్, ఉప్పులూరు మునయ్య తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 20వ తేదీ మైదుకూరులో జాబ్ మేళా

మైదుకూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త:
పట్టణంలోని వెలుగు కార్యాలయంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సందీప్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జె సి ఓ ఆంజనేయులు తెలిపారు. ఈ జాబ్ మేళాలో పలు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 7731013622 ద్వారా సంప్రదించాలన్నారు.

## ప్రజలు సద్వినియోగం చేసుకోండి

బద్వేల్ అర్బన్, డిసెంబర్ 19 ప్రభాతవార్త
ఆర్టీసీ ఇప్పటివరకు ప్రయాణికులను గమ్యస్థానాలకు సురక్షితంగా చేర్చి ప్రయాణికుల మున్ననలు పొందిందని బద్వేలు ఆర్టీసీ డిపో మేనేజర్ కన్యాకుమారి పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఆర్టీసీ తన సేవలను విస్తృత పరుస్తూ కార్గో రవాణా విభాగం నందు డోర్ డెలివరీ సదుపాయాన్ని నేటి నుంచి ప్రారంభించడం జరుగుతున్నదని ఆమె పేర్కొన్నారు. ఇందులో భాగంగా 50 కేజీల లోపు బరువు గల వస్తువు (పార్శిల్) 10 కిలోమీటర్ల విస్తీర్ణం వరకు డోర్ డెలివరీ సదుపాయం కల్పించడం జరుగుతుందని. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీరు పంపే పార్శిల్ కు పూర్తి భరోసా ఉంటుందని ఆమె ఈ సందర్భంగా తెలియజేశారు.

## అండగా ఉంటాం.. అధైర్యపడొద్దు

- ముక్కా సాయివికాస్‌రెడ్డి

ఓబులవారిపల్లె, డిసెంబరు 19, ప్రభాతవార్త:



నియోజకవర్గంలో మృతి చెందిన పలు మండలాలకు సంబంధించిన కుటుంబ పెద్దలు అకస్మాత్తుగా మృతి చెందడంతో రైల్వేకోడూరు నియోజకవర్గం టీడీపీ యువ నాయకులు ముక్కా సాయివికాస్‌రెడ్డి అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. కోడూరు, పెనగలూరు, చిట్వేలి మండలాలకు సంబంధించిన వెంకట సుబ్బయ్యనాయుడు, పాటూరు నరసింహారెడ్డి, లక్ష్మయ్య, గాంధీజీరాజులు అకస్మాత్తుగా మృతి చెందడంతో వారి కుటుంబాలను ఆయన పరామర్శించి అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. మృతి చెందిన మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులు

సిద్దవటం, డిసెంబరు 19, ప్రభాతవార్త:
రైతుల సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ తెలిపారు. మండలంలోని పెద్దపల్లి గ్రామ పంచాయతీ సచివాలయంలో గురువారం రెవెన్యూ సదస్సు జరిగింది. రెవెన్యూ సదస్సుకు కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు భూ సమస్యలపై ఇచ్చిన అర్జీ క్షుణ్ణంగా పరిశీలించి ప్రతి రైతు సమస్య పరిష్కరించేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతుల భూములు అన్యాక్రాంతం జరిగి ఉంటే ప్రతి రైతుకు న్యాయం చేస్తామన్నారు. గ్రామ సచివాలయ పరిధి వంక పరంబోకు, ప్రభుత్వ స్థలాన్ని అన్యాక్రాంతం చేసి గృహాలు నిర్మించుకున్నారని ఆ ప్రాంత వాసులు ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం చేసి ఉంటే తొలగించాలని ఇన్‌ఛార్జి తహసీల్దార్‌కు ఆదేశించారు. ఈ మేరకు ఇన్‌ఛార్జి తహసీల్దార్ అక్రమ కట్టడాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, స్పెషల్ ఆఫీసర్ జయసింహ, ఇన్‌ఛార్జి తహసీల్దార్ మాధవీలత, తుర్రా చిన్నక్క, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, సర్వేయర్ సుదర్శన్ వీఆర్వోలు, రజినీ, శ్యాంబాబు, రేణుక, సర్పంచ్ ప్రతినిధి, తుర్రా ప్రతాప్ నాయుడు, ఉపసర్పంచ్ ప్రతినిధి నాగం నరసింహారెడ్డి, రాజంపేట తెదేపా అధికార ప్రతినిధి కడితం రామ్మోహన్ నాయుడు, రైతులు పాల్గొన్నారు.



# అక్రమ కట్టడాలు కూల్చివేత

- ఇన్‌ఛార్జి తహసీల్దార్ మాధవీలత



సిద్దవటం, డిసెంబరు 19, ప్రభాతవార్త:
సిద్దవటం మండలంలోని భాకరాపేట, మాధవరం-1 గ్రామాల్లో గురువారం అక్రమ కట్టడాలను కూల్చివేసినట్లు సిద్దవటం ఇన్‌ఛార్జి తహసీల్దార్ మాధవీలత తెలిపారు. మండలంలోని భాకరాపేటలో ఆమె మాట్లాడుతూ అక్రమ కట్టడాలను తొలగించాల్సిందిగా కడప ఆర్డీవో ఆదేశాల మేరకు పోలీసుల సహాయంతో అక్రమ కట్టడాలు తొలగించే చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. పెద్దపల్లె సర్వే నెంబర్ 641/1లో భాకరాపేట గ్రామానికి చెందిన తుర్రా సుబ్బలక్షమ్మ ప్రభుత్వ వంక పరంబోకు స్థలాన్ని ఆక్రమించుకొని ఇంటి నిర్మాణం చేపట్టిందన్నారు. అలాగే మాధవరం గ్రామ సర్వేనెంబర్ 864/7లో గ్రామ సచివాలయం-2 పరిధిలో వంక పరంబోకు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి భవనాన్ని నిర్మించారన్నారు. ఆయా నిర్మాణాలపై పలువురు ఫిర్యాదు చేయడంతో భవనాలను తొలగించడం జరిగిందన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏఎస్ఐ సుబ్బరామచంద్ర, పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పసుపులేటి శ్రీనివాసులు, వీఆర్వోలు శ్యాంబాబు, రజినీ, వీఆర్ఏలు పాల్గొన్నారు.



## 21న ప్రపంచ ధ్యానంలో పాల్గొనండి

కాశినాయన, డిసెంబర్ 19 (ప్రభాతవార్త)



ప్రపంచవ్యాప్తంగా తొలిసారిగా ప్రపంచ ధ్యాన దినోత్సవం డిసెంబర్ 21న సమయం రాత్రి 8 గంటలకు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు రవి శంకర్ గురుదేవులతో ప్రపంచమంతా ధ్యానం చరిత్రాత్మక ప్రపంచ ఘట్టంలో భాగస్వామ్యం కావాలని గురువారం ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి యస్ నారాయణరెడ్డి కోరారు. ఈ ధ్యానాన్ని శ్రీ శ్రీ రవిశంకర్ గురుదేవ్ లైవ్ లో తీసుకుంటారని 100 ఉచితంగా ప్రపంచంలోనే అతిపెద్ద శాంతియుత సమూహం నిర్వహిస్తారన్నారు. ఇది మన లోపల ఆనందాన్ని అనుభవించి దానిని ప్రపంచంతో పంచుకుంటారని ఆశిస్తున్నామన్నారు. ఐక్యరాజ్యసమితి డిసెంబర్ నెల 21,2024 న మొదటిసారి ధ్యాన దినోత్సవాన్ని కార్యక్రమం నిర్వహిస్తుండగా ముఖ్య అతిథులుగా విశంకర్ గురూజీ పాల్గొని ధ్యానం చేయిస్తారన్నారు. ప్రపంచమంతా మనందరం పాల్గొని మన ప్రాంతంలో శాంతిని నెలకొల్పాలన్నారు. మనం మన కుటుంబం వ్యక్తి గతంగా కూడా శాంతిని నెలకొల్పుకుందామని బి.యస్ నారాయణరెడ్డి తెలిపారు వివరాలకు 9441932390 సెల్ నెంబర్ సంప్రదించాలన్నారు.

## రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం

ఖాజీపేట, డిసెంబర్ 19, ప్రభాతవార్త:
గురువారం నాడు ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది సుంకేసులలో గల కస్తూరిబా గాంధీ బాలిక విద్యాలయం నందు రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమంను నిర్వహించారు. ఇందులో భాగంగా డాక్టర్ ఆయేషా సుల్తానా ఆధ్వర్యంలో జిల్లా రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమం ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమేష్ తనిఖీ చేసి అడ్లసెంట్ గర్ల్స్, ఆబీఎస్కె స్క్రీనింగ్ పర్యవేక్షణ చేసి వీక్లీ ఐరన్ ఫోలిక్ సప్లిమెంటేషన్ హిమోగ్లోబిన్ పరీక్షలు హైట్, వెయిట్, 4 'డీఎస్' కండిషన్ స్క్రీనింగ్ నిర్వహించడం జరిగింది. కస్తూరిబా పాఠశాల కేంద్రంలో 230 పిల్లలు రిజిస్టర్ అయి ఉన్నారని, వీరిలో 30మంది పిల్లలకు స్క్రీనింగ్ నిర్వహించడం జరిగింది. వీరిలో 4పిల్లలకు అనేమియా అని గుర్తించడం జరిగింది. కండిషన్ గుర్తించి డిఫెక్ట్ ఉన్న పిల్లలకు జిల్లా రిమ్స్ ఉన్న డీఈఐసీ డిస్ట్రిక్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌కు మరియు డిస్ట్రిక్ట్ హాస్పిటల్ ప్రొద్దుటూరు పంపవలసిందిగాఆదేశించారు. తదుపరి చికిత్స కోసం ఖాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్బియస్‌కె నవీన్ కుమార్, ఆర్‌బియస్‌కె డిస్ట్రిక్ట్ మేనేజర్ రామూర్తి నాయక్, సోషల్ వర్కర్, పాఠశాల ప్రిన్సిపాల్ భార్గవి, ఆరోగ్య విస్తరణ అధికారి బి. నాగభూషణం, ఆశనోడల్ ఆఫీసర్ అరుణకుమారి, సూపర్‌వైజర్ కృష్ణ ప్రియ, శోభన్ బాబు, ఏఎన్ఎం శివనగామణి, పక్కృతమ్మ, పాఠశాల ఏఎన్ఎం మలికి రెడ్డి, కళావతి, కీర్తి, ఆశ కార్యకర్తలు వెంకట సులోచన, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.




# ప్రజా సంఘాల ఆధ్వర్యంలో హిందూ, ముస్లిం ఐక్యత దినోత్సవం

బద్వేలు అర్బన్, డిసెంబర్ 19, ప్రభాతవార్త
పట్టణంలోని సిద్ధవటం రోడ్డు లో గల మసీద్ కాంప్లెక్స్ నందు స్వతంత్ర సమరయోధులు రాంప్రసాద్ బిస్మిల్ అష్ఫాఖ్ కుల్లా ఖాన్ లకు ఆవాజ్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నివాళులు అర్పించారు. ,ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా వచ్చేసిన ఆవాజ్ కమిటీ జిల్లా అధ్యక్షులు పి,చాంద్ బాషా, బద్వేల్ పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నాన బాల వెంకటేశ్వర్లు ,యోగివేమన యూనివర్సిటీ పాలకమండలి సభ్యులు కొండపల్లి చిన్న సుబ్బారావు ,మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ మెహబూబ్ భాష లు మాట్లాడుతూ బ్రిటిష్ పాలకుల కబంధహస్తాల నుండి మాతృభూమిని విముక్తి చేయాలని తపనతో రాంప్రసాద్ బిస్మిల్ అష్ఫాఖ్ కుల్లా ఖాన్ లు తమ ప్రాణాల సైతం పణంగా పెట్టారన్నారు. ఇరువురు చదువుని మధ్యలోనే స్వస్తి పలికి బ్రిటిష్ పాలన నుండి విముక్తి కలిగించాలని హిందుస్థాన్ పబ్లికేషన్ అనే సంస్థలు చేరి జాతీయోద్యమ చరిత్రలో తమకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సాధించారన్నారు. చివరకు ఉరిశిక్షలను కూడా సంతోషంగా స్వీకరించి చిరస్మరణీయులయ్యారు. చివరి రోజుల్లో కూడా మత ప్రసక్తి లేకుండా భారతీయులంతా కలిసిమెలిసి ఉండాల్సిందిగా అష్ఫాఖుల్లా ఖాన్ ప్రజలను కోరారు. 1927 డిసెంబరు 19న ఆయనను ఉత్తరప్రదేశ్‌లోని ఫైజాబాదు జైలులో ఉరి తీస్తారనగా, డిసెంబరు 16న జైలు నుండి దేశవాసులను ఉద్దేశిస్తూ ఒక లేఖ రాశాడు. ఆ లేఖలో, ఖి భారతదేశ సోదరులారా మీరు ఏ మతానికి, సంప్రదాయానికి చెందిన వారైనా సరే, దేశసేవలో కృషిచేయండి. వృధాగా పరస్పరం కలహించకండి.



అన్ని పనులూ ఒకే లక్ష్యాన్ని సాధించేందుకు సాధనాలు. అలాంటప్పుడు ఈ వ్యర్థపు కొట్లాటలూ, కుమ్ములాటలు ఎందుకు? ఐకమత్యంతో దేశంలోని దొరతనాన్ని ఎదిరించండి. దేశాన్ని స్వతంత్రం చేయండి ... చివరగా అందరికి నా సలాం. భారతదేశం స్వతంత్రమగుగాక. నా సోదరులు సుఖంగా ఉందురు గాక‌ఖి అంటూ తన ఆకాంక్షను వ్యక్తం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సృజన్ పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాసుల రెడ్డి, బద్వేల్ పట్టణ ఆవాజ్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ అబ్దుల్ సత్తార్, షేక్ అన్వర్ భాష ,కౌన్సిలర్ మహమ్మద్ హుస్సేన్ , ముస్లిం నాయకులు ఎస్ ఏం భాష ,నూరుల్లా, షంషేర్, ఆవాజ్ నాయకులు దావూద్ ,మస్తాన్,రసూల్,ఖాజా గౌస్,మహమ్మద్,నాగూర్, తదితరులు పాల్గొన్నారు

# బిడ్డ కస్టడీపై నిర్ణయాధికారం భారతీయ కోర్టులదే-కలకత్తా హైకోర్టు స్పష్టీకరణ

(విదేశీ కోర్టు ఆదేశం ఏమైనప్పటికీ)

బద్వేలు లీగల్, డిశంబరు 19 ప్రభాతవార్త :
విదేశీ కోర్టు ఇచ్చిన ఆదేశాలు ఏ విధంగా వున్నప్పటికీ బిడ్డ కస్టడీకి సంబంధించి నిర్ణయాధికారం మాత్రం భారతీయ కోర్టులకే వుంటుందని ఇటీవల కలకత్తా హైకోర్టు స్పష్టం చేసింది. వివరాలలోకి వెళితే... రూర్కేలాకు చెందిన ఓ మహిళ తన బిడ్డను తన స్వంత కస్టడీలో వుంచుకునేందుకు వీలు కల్పిస్తూ కలకత్తా హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ బిడ్డకు పుట్టుకతోనే అమెరికా పౌరసత్వం కూడా వుంది. అమెరికాలో వుంటున్న బిడ్డ తండ్రికి బిడ్డను కలుసుకునే హక్కును కూడా కల్పించింది. అయితే బిడ్డను అమెరికాకు పంపి తండ్రికి అప్పగించాలని కాలిఫోర్నియా కోర్టు తల్లిని ఆదేశించింది. ఈ నేపథ్యంలో బిడ్డను తనకు అప్పగించాల్సిందిగా కోరుతూ తండ్రి కలకత్తా హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్‌ను దాఖలు చేశారు. కాలిఫోర్నియా కోర్టు ఆదేశాల ప్రాతిపదికగా ఈ పిటీషను దాఖలైనది. బిడ్డను తనకు అప్పగిస్తే తాను అమెరికాకు తీసుకువెళుతానని ఆ పిటీషన్‌లో తండ్రి పేర్కొనగా కమిటీ ఆఫ్ కోర్ట్స్ సూత్రం ప్రకారం విదేశీ కోర్టు ఇచ్చే ఆదేశాలను పరిగణన లోనికి తీసుకొనవలసినదిగా కోరవచ్చే తప్ప దానిని అమలు చేయాలని కోరలేరని కలకత్తా హైకోర్టు స్పష్టం చేసింది. తనకున్న ఆర్థిక స్థితి మేరకు బిడ్డకు మంచి భవిష్యత్తు కల్పించగలనని తండ్రి కోర్టు దృష్టికి తెచ్చినప్పటికీ బిడ్డ ఎక్కువ కాలం ఇండియాలోనే తల్లితో గడిపినందున బిడ్డను అమెరికాకు పంపితే తండ్రికి ఉన్న తీరిక లేని పనుల కారణంగా ఆ బిడ్డ ఒంటరిగా గడపాల్సి వుంటుందని కలకత్తా హైకోర్టు అభిప్రాయపడుతూ ఈ తీర్పును వెలువరించింది.

## శ్రీగంధం చెట్లను నరికిన గుర్తుతెలియని వ్యక్తులు

### కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

మదనపల్లెక్రైం, డిసెంబర్ 19 ప్రభాతవార్త :



మదనపల్లె జడ్జి బంగాల్లో గుర్తుతెలియని వ్యక్తులు బుధవారం రాత్రి శ్రీగంధం చెట్లు నరికేసి దుంగలను చోరీ చేశారు. బంగ్లాలో వున్న అటెండర్ మునివెంకటప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఒకటవ పట్టణ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సిఐ కథనం మేరకు వివరాలిలా వున్నాయి. పటేల్‌రోడ్డులోని జడ్జి బంగాల్లో కొన్ని శ్రీగంధం చెట్లు వున్నాయి. వాటిని గమనించిన ఎర్రచందనం దొంగలు బుధవారం అర్థరాత్రి చెట్లను నరికేసి వారికి పనికివచ్చే దుంగలను చోరీ చేసుకుని పారిపోయారు. ఉదయం గమనించిన అటెండెర్ పోలీసులకు సమాచారం ఇవ్వటంతో డిఎస్పీ కొండయ్యనాయుడు, ఒకటవ పట్టణ సిఐ ఎరిసావల్లి, ఎస్ఐ వెంకటశివకుమార్‌లు సంఘటనా స్థలంలకు చేరుకుని పరిశీలించారు. అటెండర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. డ్యాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేయించినట్లు సిఐ తెలిపారు. డ్యాగ్స్ సొసైటీ కాలనీ వరకూ వెళ్లి ఆగిపోయినట్లు పోలీసులు తెలిపారు.

## అటల పోటీలు ప్రారంభం



ప్రొద్దుటూరు, డిసెంబర్ 19, ప్రభాతవార్త :
స్థానిక కొర్రపాడు రోడ్డు లోని పాలిటెక్నిక్ కళాశాలలో మూడురోజుల పాటు జరగబోయే ఐ.పి.ఎస్.జి.ఎం 2024 ఆటలపోటీలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. ఈ పోటీలలో జిల్లాలోని 15 పాలిటెక్నిక్ కళాశాలల నుండి దాదాపు 450 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. సమావేశానికి ఆర్జేడీ ఆఫీసు అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటసుబ్బయ్య, వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జయరామిరెడ్డి, ఆర్సీపిఈ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి పాల్గొన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్ బాబు మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆటలు ఆడాలని తెలిపారు. జయచంద్రారెడ్డి మాట్లాడుతూ స్పోర్ట్స్ సర్టిఫికెట్ ప్రాముఖ్యత వివరించారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ జీవితంలో ఆటల ప్రాముఖ్యత క్రీడాకారులకు తెలిపారు. సమావేశాన్ని ఈఈఈ శాఖధిపతి మంజునాథ్ నిర్వహించగా వివిధ శాఖధిపతులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## కృష్టాలయంలో ధనుర్మాస ఉత్సవాలు

ప్రొద్దుటూరు , డిసెంబర్ 16, ప్రభాతవార్త :



స్థానిక శివాలయం సమీపంలో ఉన్న శ్రీకృష్ణాలయంలో సోమవారం నుండి ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు గురువారానికి 4వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆలయ మూలవిరాట్టు లకు గోదాదేవి, రంగనాథ స్వామి అలంకరణ నిర్వహించి, ప్రత్యేక గో క్షీర, పంచామృత అభిషేకం, పుష్పాలంకరణ, పూజలు, తిరుప్పావై కీర్తనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తొలి రోజు పెద్ద ఎత్తున భక్తులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు



చిన్నమండెం డిసెంబర్ 19 ప్రబాతవార్త:
రెవెన్యూ పరంగా వున్న సమస్యల పరిష్కారం కొరకు ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని ఆర్డీవో శ్రీనివాసులు పేర్కొన్నారు. అందులో బాగంగా గురువారం చిన్నమండెం సచివాలయం లో రెవెన్యూ సదస్సు జరిగింది. సదస్సులో 272 అర్జీలు వచ్చినట్లు తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా రెవెన్యూ సమస్యలపై16 ,పింఛన్లు 51, హౌసింగ్ 160, రైస్ కార్డుల కొరకు 34, అదర్స్ 11, దరకాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరకాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వాటిని పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ చంద్రానాయక్ వి ఆర్ ఓ గంగులయ్య, సర్వేయర్ శ్యామల సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు.

## ఆర్థికంగా అభివృద్ధి సాదించాలి

వీరపునాయునిపల్లి, డిసెంబరు 19, ప్రభాతవార్త :



పొదుపు సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి సాదించాలని, ఇందుకు ప్రణాలికాబద్ధంగా మెరుగు పడాలని ఏపీఎంలు బాలాస్వామి, వెంకటేశ్వర రావులు అన్నారు. గురువారం ఆర్థికంగా అభివృద్ధి, సామాజిక పెన్షన్ల తనిఖీ తదితర వాటిపై అవగాహన కల్పించారు. బ్యాంకుల నుండి ఏ విధంగా రుణాలు పొందాలి, తీసుకున్న రుణాలు ఏ విధంగా తిరిగి చెల్లించాలి వివరించారు. ఈ కార్యక్రమం లో ఏపీఎండీ భాగ్యమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.